

రెడీమేడ్ పిండివంటలు

ఆర్డర్‌పై రుచికరమైన సంక్రాంతి పిండివంటలను అందించేందుకు స్వగృహ ఫుడ్ సెంటర్లు ఆహ్వానం పలుకుతున్నాయి. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాయి. 8లో▸



ఘనంగా గోదారంగనాథుల కల్యాణం

జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో శుక్రవారం గోదారంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 16.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి తీవ్రత కాస్త తగ్గుతున్నది.

న్యూస్‌రీల్

ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని ఎమ్మెల్యే రేఖానాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న కల్వర్టులు, బీటీ రోడ్లు, సీసీ రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఖానాపూర్ సాయిబాబా ఆలయకమిటీ సభ్యులతో కలిసి ఆలయ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరారు. అనంతరం ఇటీవల తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాలాచారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీపీసీఎల్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి (బీ) బైపాస్‌రోడ్‌లో భైంసా పోలీస్ ఆధ్వర్యంలో బీపీసీఎల్ (భైంసా పోలీస్ క్రికెట్ లీగ్) పోటీలను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే పల్లెలు, పట్టణాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఏఎస్పీ కిరణ్‌ఖారె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు పోటీలకు అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతీ మండలం నుంచి రెండు జట్ల చొప్పున పాల్గొనగా, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, డాక్టర్స్ అసోసియేషన్ జట్లుగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలు ఈనెల 17వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, నియోజకవర్గ నాయకుడు రామారావుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన కడ్తాల్ అయ్యప్ప ఆలయం

- నేడు కర్పూర మకరజ్యోతి దర్శనం



ముస్తాబైన అయ్యప్ప ఆలయం

లక్ష్మణచాంద: కర్పూర మకరజ్యోతి దర్శనానికి సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలోగల శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం ముస్తాబైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఇది మొట్టమొదటి అయ్యప్ప ఆలయం కావడం విశేషం. ఇక్కడ శబరిమల ఆలయం తరహాలోనే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి నర్సారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సంక్రాంతి వేడుకలు ఉంటాయని, ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, అనంతరం విశేష అలంకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్వామి వారి ఆభరణాలు, ఉత్సవ విగ్రహాన్ని రథంలో ప్రతిష్ఠించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగిస్తామని తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కర్పూర మకర జ్యోతి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. రాత్రివేళ మహా పడిపూజ నిర్వహిస్తామని తెలిపారు. దీక్షాపరులు, భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.







మార్కెట్‌లో సంక్రాంతి సందడి

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ శుక్రవారం సందడిగా మారింది. శని, ఆది, సోమవారాల్లో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు కావడంతో జనంతో కిటకిటలాడింది. దుకాణాల్లో వివిధ ఆకృతుల్లో ఉన్న గాలిపటాలను కొనుగోలు చేయడంలో చిన్నారులు మునిగితేలారు. మహిళలు రంగురంగుల ముగ్గులు, నేరేడు పండ్లు, నోముల కోసం స్టీల్ వస్తువులు తదితర సామగ్రి కొనుగోలు చేస్తూ కనిపించారు. - సాక్షి ఫొటో గ్రాఫర్, నిర్మల్



పత్తితో పరేషాన్!

- రోజుకో ధర.. రైతుల గుండెల్లో దడ
- అమ్మాలో.. ఆపాలో తెలియని సందిగ్ధత
- గందరగోళంగా పత్తి రైతుల పరిస్థితి
- వ్యాపారుల మాయాజాలమే కారణమా?

భైంసాటౌన్: పత్తి ధర పరేషాన్ చేస్తోంది. రోజుకో ధర పలుకుతూ రైతులను గందరగోళంలోకి నెడుతోంది. నిలకడలేని ధరలతో అమ్మాలో.. ఆపాలో తెలియని సందిగ్ధ స్థితిలో దూది రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పత్తిని విక్రయించేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. పెరిగిన పెట్టుబడులకు తగినట్లుగా క్వింటాల్‌కు రూ.10వేలు పలికితేనే రైతులకు గిట్టుబాటు కానుండగా మార్కెట్‌లో ధర రూ.8వేలకు అటూ ఇటుగా ఊగిసలాడుతోంది. నిలకడలేని ధరలతో అయోమయానికి గురవుతున్న పత్తి రైతుల ప్రస్తుత పరిస్థితి.. మార్కెట్ ధరలపై కథనం..

ఇండ్లు, కొట్టాల్లో నిల్వలు

పత్తి ధరలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇండ్లు, కొట్టాల్లో నిల్వ చేసుకుని మంచి రేటు కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు మార్కెట్‌లో హెచ్చుతగ్గుల ధరలతో ఆందోళన చెందుతున్నారు. క్వింటాల్‌కు రూ.10వేలు పలికితే పెట్టుబడులు చేతికొస్తాయని గంపెడాశతో నిరీక్షిస్తున్నారు. కానీ, మార్కెట్‌లో అంతర్జాతీయంగా డిమాండ్ లేదంటూ వ్యాపారులు ధర పెంచడం లేదు. ఫలితంగా రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సీసీఐ ప్రైవేట్ కొనుగోళ్లు చేపట్టేందుకు ముందుకు రాగా, వ్యాపారులు ధర పెంచేశారు. ఇప్పుడు సీసీఐ వెనక్కి తగ్గడంతో మరోసారి ధర తగ్గిస్తూ వస్తుండడం గమనార్హం. దీంతో వ్యాపారుల మాయాజాలంతోనే ధరలు తగ్గుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

గతేడాది ధర కోసం నిరీక్షణ

మార్కెట్‌లో పత్తి ధర నిలకడగా ఉండడం లేదు. కొనుగోళ్ల ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.9వేల వరకు పలికింది. క్రమంగా ధర తగ్గిస్తూ వచ్చింది. ఓ దశలో రూ.7,400కు పడిపోయింది. దీంతో సీసీఐ ఆధ్వర్యంలో ప్రైవేట్ కొనుగోళ్లు చేపట్టాలని భావించారు. కానీ, కొద్దిరోజుల్లోనే మళ్లీ ధర రూ.8వేలకుపైగా పెంచడంతో సీసీఐ వెనక్కి తగ్గింది. భైంసా మార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తికి రూ.8.040 ధర పలికింది. వారంరోజుల ధరలు చూస్తే ఒక రోజు పెరిగితే మరోరోజు తగ్గుతూ వస్తున్నాయి. అయినా రైతులు గతేడాది ధరే వస్తుందని కళ్లల్లో వత్తులు వేసుకుని నిరీక్షిస్తున్నారు.

ఈవారం పత్తి ధరలు ఇలా..

తేదీ	(రూ.లలో)
4.	8,300
6.	8,300
7.	8,400
8.	8,500
9.	8,210
10.	8,300
11.	7,950
12.	8,000
13.	8.040

అమ్ముదామంటే ధర లేదు



పత్తికి మార్కెట్‌లో ధర నిలకడగా ఉండడంలేదు. ధర పెరిగిన మర్నాడే మళ్లీ తగ్గుతోంది. సీసీఐ ఆధ్వర్యంలో ప్రైవేట్‌గా పత్తి కొనుగోలు చేయాలి. ఇళ్లలో నిల్వ ఉంచడంతో బరువు తగ్గుతోంది. అయినా ధర పెరుగుతుందని చూస్తున్నం. – శివాజీ, రైతు, సిద్దూరు

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన రైతులు

తానూరు: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బెల్‌తరోడ వద్ద జాతీయ రహదారిపై బోసి గ్రామ రైతులు శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం అధికారులు 12.50గంటలు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా 7గంటలు కూడా సరిగా రావడం లేదని వాపోయారు. దీంతో పంటలకు సాగునీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంజేశారు. అరగంటకోసారి ఎల్సీ పేరిట విద్యుత్ కోతలు విధిస్తున్నారని, ఒక గ్రామంలో ఎల్సీ తీసుకుంటే ఆ ఫీడర్ పరిధిలోని ఐదారు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. రెండ్రోజులుగా దినంలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నారని, ఈ విషయమై అధికారులను అడిగితే పైనుంచే సరఫరా లేదని దాటవేస్తున్నారని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ ఏఈ జాదవ్ ప్రదీప్ ఆందోళన వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు.

కంటివెలుగుకు సర్వం సిద్ధం



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ

- కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ
- కలెక్టరేట్‌లో ట్రయల్ రన్

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 18నుంచి ప్రారంభించనున్న రెండో విడత కంటివెలుగు కోసం సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ తెలిపారు. శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడేతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కంటివెలుగు శిబిరాల నిర్వహణకు 32 టీంలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కో టీంలో మెడికల్ ఆఫీసర్, ఆప్తమాలజిస్ట్, ఇద్దరు హెల్త్ సూపర్‌వైజర్లు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ముగ్గురు ఆశ కార్యకర్తలు ఉంటారని పేర్కొన్నారు. మూడు మున్సిపాల్టీలు, 396 గ్రామపంచాయతీల పరిధిలో 18 ఏళ్లు పైబడిన 5.47లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించడం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. 30,080 రీడింగ్ గ్లాసెస్ జిల్లాకు చేరుకున్నాయని చెప్పారు. జిల్లా కేంద్రంలో ప్రతిరోజూ 400 మంది, ఒక్కో పంచాయతీ పరిధిలో 300 మందికి స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే కంటివెలుగు నిర్వహణపై కలెక్టరేట్‌లో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ, అదనపు కలెక్టర్లు రాంబాబు, హేమంత్ బోర్కడేకు వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, మాస్ మీడియా అధికారి రవీందర్, డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'కంటివెలుగుపై అలసత్వం వద్దు'

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 18నుంచి నిర్వహించనున్న కంటివెలుగు కార్యక్రమ అమలులో అధికారులు అలసత్వం వహించొద్దని కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ పేర్కొన్నారు. కంటివెలుగు శిబిరాల ఏర్పాటుపై ఆయన శుక్రవారం జిల్లా వైద్యాధికారులు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటివెలుగు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కంటి పరీక్షలు చేయించుకునేవారు ఆధార్‌కార్డు వెంట తీసుకువచ్చేలా చూడాలని తెలిపారు. జిల్లాలో 32 బృందాలను నియమించామని పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులవారీగా ఏరోజుకారోజు షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేయించుకునే వారి వివరాలు ఒకరోజు ముందుగానే ఇంటింటికీ వెళ్లి సేకరించి వారు శిబిరాలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. మూడురోజుల ముందుగానే గ్రామాల్లో టాంటాం వేయించాలని, రోజువారీ టార్గెట్‌ను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, మాస్ మీడియా అధికారి రవీందర్, డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పిల్లలకు బుడుబుంగలు

- నేటికీ కొనసాగుతున్న సంప్రదాయం



భైంసాలో బుడుబుంగలు పోస్తున్న అవ్వ (ఫైల్)

భైంసా: బుడుబుంగలు (భోగి పండ్లు).. ఈ ప్రాంతంలో ఈ పదం భోగి రోజున అందరినోటా వినిపిస్తుంది. ప్రతీ ఇంటా ఐదేళ్లలోపు పిల్లలకు ఇవి పోయడం ఆనవాయితీ. రేగు పండ్లు, చిల్లరనాణేలు, పచ్చి శెనగకాయలు, జీడిపండ్లు, జామపండ్లు, బంతిపూలు ఇలా ఐదింటిని కలిపి భోగి పండ్లు అంటారు. భోగిరోజు ఉదయం పిల్లలకు తలంటు స్నానం చేయించి కొత్తబట్టలు వేస్తారు. సాయంత్రం ఇంటి మధ్యలో పీట వేసి దానిపై కొత్త వస్త్రం పరిచి కూర్చొబెడతారు. తలపై భోగిపండ్లు పోస్తారు. పిల్లలంతా వాటిని పోగుచేయగా వాటినే ఇలా ఐదుసార్లు వేస్తారు. తర్వాత అక్కడికి వచ్చిన పిల్లలకు వాటిని పంచుతారు. ఇలా చేస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, దీర్ఘాయుష్షుతో కలకాలం జీవిస్తారని పెద్దల నమ్మకం.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

సర్సాపూర్(జి): నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్లి(కే) గ్రామంలో గ్రామస్తులు, ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను శుక్రవారం నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఆటలు ఆడాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్‌రూరల్ సీఐ వెంకటేశ్, సర్సాపూర్(జి) ఎస్సై పాకాల గీత పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో గాలిపటాలు ఎగరేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఖాళీ ప్రదేశాల్లోనే గాలిపటాలను ఎగురవేయాలని, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లొద్దని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జే చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. పిల్లలు బిల్డింగ్‌పై గాలిపటాలు ఎగురవేసేటపుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా దగ్గర ఉండాలని సూచించారు.

'పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి'



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 18నుంచి ప్రారంభించనున్న 'కంటివెలుగు' నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. శుక్రవారం కంటివెలుగు ఏర్పాట్లపై కలెక్టర్లు, వైద్యాధికారులు, పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. శిబిరాలను అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ మాట్లాడుతూ.. జిల్లాలో కంటివెలుగు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఆర్డీవోలు స్రవంతి, రవికుమార్, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, డీపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల రజతోత్సవం



నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బాగులవాడ శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో 1997–98 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు శుక్రవారం స్థానిక దివ్య గార్డెన్స్‌లో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. వారికి పాదాభివందనం చేశారు. పాతికేళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా పాఠశాలలో చదివిన జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. మధ్యలోనే కాలం చేసిన మిత్రులను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. దూర దేశాల్లో ఉంటున్న మిత్రులతో ఆన్‌లైన్ లైవ్ ద్వారా మాట్లాడడం విశేషం. తాము నిర్వహిస్తున్న 'బచ్ పన్ కే దోస్త్ సొసైటీ' ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల కోసం అంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు అప్పాల వంశీకృష్ణ, అధ్యక్షుడు బండారి భీమేశ్, ప్రధాన కార్యదర్శి రాసం శ్రీధర్, కోశాధికారి రావుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నాయిడి మురళీధర్, సంయుక్త కార్యదర్శి పూదరి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ హాజరై మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. 20 జిల్లాలకు చెందిన దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన జిల్లా క్రీడాకారులు ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రథమ స్థానంలో నిజామాబాద్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సిద్దిపేట, హైదరాబాద్ జట్లు నిలిచాయన్నారు. వీరికి ఆయన బహుమతులు ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి, సెక్రటరీ అన్నపూర్ణ, శోభన్‌బాబు, పేట అధ్యక్షులు భూక్య రమేశ్, రమణారావు, పీడీలు శ్రీనివాస్, భూమన్న, శ్వేత, సంగీత, సంజు తదితరులున్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌రూరల్: రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై నాగ్‌నాథ్ వివరాల ప్రకారం... మండలంలోని కచికంటి గ్రామానికి చెందిన గోడం భీంరావు (55) ఈ నెల 10న ఇంటి ఎదుట గల సీసీ రోడ్డుపై ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు తీవ్రంగా గాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో బామ్నికే వాసి మృతి

- రోడ్డు ప్రమాదంలో గాయపడడంతోనే..
- నాలుగు నెలల క్రితమే గల్ఫ్‌బాట..


రాజు (ఫైల్)

లోకేశ్వరం: ఉన్న ఊరిలో సరైన పని లేక కుటుంబ పోషణకు గల్ఫ్ బాట పట్టిన ఓ వ్యక్తిని రోడ్డు ప్రమాదం కబళించింది. కుటుంబీకుల వివరాల ప్రకారం... మండలంలోని బామ్ని కే గ్రామానికి చెందిన గొల్ల రాజు (39) కూలీ చేసుకుంటూ జీవించేవాడు. గ్రామంలో సరైన పనులు లేక కుటుంబ పోషణ కోసం అప్పు చేసి డిసెంబరు 29న దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ నివాసం ఉండే ప్రదేశం నుంచి పనిచేయడానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. రాజుకు భార్య చిన్నక్క, కుమారుడు రేవంత్ ఉన్నారు. చివరి చూపుకోసం మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

రాంటెక్ వాసి విజయవాడలో ఆత్మహత్య


రాజు(ఫైల్)

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన మరకంటి రాజు(30) విజయవాడలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాజు తన భార్య మాదవితో పదేళ్లుగా కూలీ పని చేసుకుంటూ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల వారికి కుమారుడు జన్మించాడు. అయితే కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాగు లేకపోవడంతో ఎన్ని ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లి శుక్రవారం విజయవాడలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడి పోలీసులు ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రెడీమేడ్ పిండివంటలు

- ఆర్డర్లపై సిద్ధం చేస్తున్న వైనం ● ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలకు ఎగుమతులు
- ఉపాధి పొందుతున్న పలువురు మహిళలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్వగృహ ఫుడ్ సెంటర్లు ● సంక్రాంతి సందర్భంగా భలే గిరాకీ


నిర్మల్‌లో చకినాలు వేస్తున్న మహిళలు

సంక్రాంతి అనగానే మొదటగా గుర్తొచ్చేది రంగవల్లులు, పిండివంటలే. ప్రతీ ఇంట్లో పలురకాల ఘుమఘుమలాడే పిండివంటలు సిద్ధం చేసుకోవడం మనకు తెలిసిందే. అయితే ప్రస్తుతం మారుతున్న జీవనశైలి పిండివంటలను చేసుకునే అలవాటును తగ్గించి ఆర్డర్‌పై తెచ్చుకునే దిశగా మారిపోయింది. పలువురు సమయాభావంతో ఆర్డర్లపై పిండివంటలను సిద్ధం చేయించుకుంటుండడంతో మరొకరికి ఉపాధిగా మారుతోంది. సంక్రాంతికి పిండివంటల గిరాకీ ఎక్కువగా ఉండడంతో పలువురికి చేతినిండా పని దొరుకుతోంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో స్వగృహ ఫుడ్ సెంటర్లకు భలే క్రేజ్ ఏర్పడింది.


ఆదిలాబాద్‌లో పిండి వంటలు సిద్ధం చేస్తున్న మహిళ →


అరిసలు
చకినాలు
బొబ్బట్లు

ఆదిలాబాద్‌లో...

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో పలు స్వగృహ సెంటర్లు వెలిశాయి. దీంతో కొందరు ఆర్డర్లపై పిండివంటలు తీసుకుపోతుండడంతో సంక్రాంతి వంటలతో పలువురు ఉపాధి పొందుతున్నారు. జిల్లాతో పాటు పక్క రాష్ట్రమైన మహారాష్ట్రకు సైతం సరఫరా చేస్తున్నారు. కిలోకు రూ.200 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు.

మంచిర్యాల నుంచి విదేశాల వరకు..



మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో స్వీట్ హౌజ్ సెంటర్ల వారు తమ గోదాముల్లో పిండి వంటలను బారి ఎత్తున తయారు చేస్తున్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి ప్రత్యేక వంటవాళ్లను పిలిపిస్తున్నారు. కొందరు ఇంటివద్ద దీనిని చిన్న వ్యాపారంగా మార్చుకొని హోంఫుడ్ సెంటర్లకు ఇస్తున్నారు. అలాగే ఇక్కడి నుంచి విదేశాలతో పాటు, వివిధ రాష్ట్రాల్లో చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లే పిల్లల కోసం.. బంధువులు, స్నేహితులకు ఇక్కడి నుంచి సంక్రాంతికి పిండిడి వంటలు (హోంఫుడ్స్) కొనుగోలు చేసి పంపిస్తున్నారు.

మంచిర్యాలలో ధరలు ఇవిగో...

కిలోకు	ధరలు
చకినాలు	- రూ. 320
కారపూసలు	- రూ320
గారెలు-	రూ300 -350 వరకు
బెల్లం అరిసెలు	-రూ.400
బూరెలు	- రూ. 450- 500 వరకు

నిర్మల్‌లో స్వగృహ ఫుడ్స్‌కు క్రేజ్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలోని శ్రీగాయత్రి స్వగృహ ఫుడ్స్ వారు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు, విదేశాలకు సైతం కొరియర్ ద్వారా ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఈ స్టాల్ వద్ద జనం బారులు తీరుతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 1 నుంచి రోజుకు సుమారు 70కిలోల చకినాలను రిటైల్‌గా విక్రయించినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 20 రకాల పిండివంటలను అందుబాటులో ఉంచామని, దేనికైనా కిలోకు రూ.260 నుంచి 300లకు విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే నగరంలో పలుచోట్ల స్వగృహ పిండివంటలను తయారు చేసి విక్రయిస్తున్నారు.

విదేశాలకు సైతం....



అధికారులు, వ్యాపారస్తులు పిండి వంటలను ఆర్డర్లు ఇవ్వడానికి ముందుకు వస్తుంటారు. దీంతో ఆర్డర్ల సంఖ్య పెరుగుతోంది. ఎనిమిదేళ్లుగా పిండి వంటలు చేస్తున్నాను. నిర్మల్, హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి సైతం వినియోగదారులు వస్తుంటారు. సంక్రాంతి, దీపావళి, దసరా వంటి సమయాల్లో అమెరికా వంటి విదేశాలకు సైతం పంపుతుంటాం. – రాము, పిండి వంటల తయారీదారుడు, ఓల్డ్ బస్టాండ్ ఏరియా, ఆదిలాబాద్

నాణ్యత, శుభ్రతను పాటిస్తూ



15 ఏళ్లుగా పిండి వంటలు చేస్తున్నాను. సంక్రాంతి సమయంలో ఆర్డర్లు చాలా ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా సకినాలు, గారెలు, అరిసెలు, గర్జలు మొదలైన వాటి గురించి ఎక్కువ మంది వస్తుంటారు. నాణ్యత, శుభ్రతను పాటిస్తూ రుచికరమైన పిండి వంటలు చేయడంతో గతంతో పోలిస్తే గిరాకీ చాలా పెరిగింది. నాతో పాటు మరికొందరు మహిళలు ఉపాధి పొందుతున్నారు. – సమంత, పిండి వంటల తయారీదారు, కోలిపురా, ఆదిలాబాద్

ఉపాధితో పాటు ఆదాయం



మంచిర్యాలలోని స్వీట్‌హౌజ్ దుకాణంలో లభించే సకినాలు, కారపూసలు ఇతర పిండివంటలను 12ఏళ్లుగా కొనుగోలు చేస్తున్న. ఇంట్లో ఇద్దరం మాత్రమే ఉంటాం. ఒకటి, రెండు కిలో లకు ముకుడు, పెట్టి పిండి వంటలు చేయటం కొంచెం కష్టంగా ఉంటుంది. ఇంట్లో మాదిరిగానే దుకాణాల్లో హోం ఫుడ్స్ లభిస్తుండడంతో అవసరం ఉన్నప్పుడు కొనుగోలు చేస్తున్నాను. – వెంకటేశ్వరావు, లక్సెట్టిపేట్, మంచిర్యాల

ఇంట్లో చేసినట్లుగానే రుచి..



మార్కెట్‌లో లభించే హోంఫుడ్స్ ఇంట్లో తయారు చేసినట్లుగా ఉంటున్నాయి. ం నాణ్యతతో పాటు రుచికరమైన పిండివంటలు కావడంతో ఆర్డర్‌లు ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం. తన కుమారుడు అమెరికాలో ఉంటాడు. స్వీట్‌హౌజ్ దుకాణాల్లో కొనుగోలు చేసి ప్రత్యేక ప్యాకింగ్‌తో పంపిస్తుంటాం. ఇంట్లో చేయాలంటే ఎంతో శ్రమతో కూడుకున్నది. సమయం ఆదావుతోంది. –రాజామారుతి, మంచిర్యాల

నాణ్యతే నడిపిస్తోంది ..



ఐదేళ్లుగా ఈ స్వగృహ ఫుడ్స్‌ను నిర్వహిస్తున్నాం. రుచికరమైన, నాణ్యమైన పిండివంటలు తయారు చేసి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. శుభకార్యాలకు, పెళ్లిళ్లు, వేడుకలకు, సభలు, సమావేశాలకు ప్రత్యేకంగా తయారు చేసి అందజేస్తున్నాం. దీంతో మాతో పాటు పదిమంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. – విజయలక్ష్మి, శ్రీగాయత్రి స్వగృహ ఫుడ్స్ నిర్వాహకురాలు, నిర్మల్

ప్రజలకు అవసరమైన పనులే చేపట్టాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి
- గిరిజన గ్రామాల్లో పర్యటన..


ఎంపల్లి తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

నార్నూర్: ప్రధాన మంత్రి ఆది అదర్శ గ్రామ యోజన పథకం (పీఎంఏఏజీవై) కింద ఎంపికైనా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాన్కాపూర్, ఎంపల్లి తండా, కొలాంగూడలో ఆయన పర్యటించారు. పీఎంఏఏజీవై పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. నార్నూర్ ఎంపల్లిగొండుగూడ, సుంగాపూర్, కొలాంగూడ, గుంజాల, గుండాల గ్రామ పంచాయతీలు ఈ పథకం కింద ఎంపికైనట్లు తెలిపారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.20లక్షల నిధులను విడుదల చేయడం జరుగుతుందని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించడానికి నిధులను వినియోగించుకోవాలని ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లకు సూచించారు. ఎంపల్లిలో తాగునీటి సమస్య ఉన్నప్పుడు సీసీరోడ్లు ఎందుకు వేశారని సర్పంచ్ రాథోడ్ గోవింద్‌ను ప్రశ్నించారు. వర్షాకాలంలో రోడ్లతో ఇబ్బంది పడుతున్నామని సీసీరోడ్లు తప్పనిసరిగా అవసరమని పీవో దృష్టికి సర్పంచ్ తీసుకువెళ్లడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపల్లి గొండుగూడలో తాగునీటి సమస్యపై దరఖాస్తు ఇవ్వాలని సర్పంచ్‌ను ఆదేశించారు. కొలాంగూడలో అంగన్‌వాడీ టీచర్ లేరని, పిల్లలు లేకుండా భవన నిర్మాణ పనులు ఎందుకు చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. వెంటనే పనులు నిలిపి వేయాలని సూచించారు. మాన్కాపూర్‌లో చెరువు ఉందని, సాగు నీటిని అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని పీవోను కోరారు. వారితో కలిసి మాన్కాపూర్ చెరువును పరిశీలించారు. లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పీఎంఏఏజీవై పనుల్లో నాణ్యత పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎంపీడీవో రమేశ్ ఉన్నారు.


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న పీవో

స్వయం ఉపాధి పథకంతో ఆర్థికాభివృద్ధి

ఉట్నూర్‌రూరల్: ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ధర్మాజీపేటలో పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులకు, బాలింతులకు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరంజిఆర్ నగర్‌లో సీపీఎస్ ఎన్జీఓ ద్వారా సాగు చేస్తున్న మామిడి, ఉసిరి పంటలను పరి శీలించారు. ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన ముగ్గురికి జైలు

నిర్మల్‌చైన్‌గేట్: ఆత్మహత్య చేసుకునేందుకు ప్రేరేపించిన ముగ్గురికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ అసిస్టెంట్ సెషన్ జడ్జి కె.అజయ్‌కుమార్ తీర్పు ఇచ్చినట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. వివరాల్లోకి వెళితే కడెం మండలం అంబర్‌పేట్ గ్రామానికి చెందిన వెంకటేశ్‌కు ఖానాపూర్ పట్టణానికి చెందిన శరణ్యారాణితో 2013లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు జన్మించారు. వెంకటేశ్ వృత్తిరీత్యా ఆర్మీలో పనిచేస్తున్నాడు. విధి నిర్వహణ నిమిత్తం అతడు జమ్ము కాశ్మీర్ వెళ్లిపోయాడు. 2021లో శరణ్యారాణి తండ్రికి ఫోన్ చేసింది. సొంత మామతో పాటు ఇంటి ఎదురుగా ఉన్న భార్యాభర్తలు తనను దుర్భాషలాడుతూ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని వాపోయింది. వరుసగా మూడు రోజులు ఇదే రీతిలో ఫోన్ చేసినా తండ్రి అందుబాటులో లేక కుమార్తె దగ్గరకు వెళ్లలేకపోయాడు. దీంతో శరణ్యారాణి పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆరు రోజులకు మృతిచెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నేరస్తులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణలో భాగంగా ఏపీపీ వై.రమణారావు 15మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో పసుపుల రాములు, సాధువుల శ్రీను, అతడి భార్య జ్యోతికి ఐదేళ్ల కారాగారశిక్ష, రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.అజేష్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు.

నాటు వైద్యం పేరిట మోసం..

- రూ.12వేలు, సెల్‌ఫోన్‌తో ఉడాయించిన నిందితులు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

జైనథ్: నడుమునొప్పికి నాటు వైద్యం పేరిట జైనథ్ మండలానికి వచ్చిన మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ముగ్గురికి చేదు అనుభవనం ఎదురైంది. జైనథ్‌కు చెందిన ఇద్దరిని నమ్మి వైద్యం కోసం రాగా రూ. 12వేలతో పాటు రూ.7వేల విలువ చేసే ఒక ఫోన్ కోల్పోవల్సి వచ్చింది. ఎస్సై పెర్సిస్ బిట్ల వివరాల ప్రకారం... నాందేడ్‌కు చెందిన పెయింటర్ జ్ఞానేశ్వర్ ఇటీవలే ప్రమాదవశాత్తు కిందపడడంతో నడుము భాగంలో దెబ్బ తగిలింది. అప్పటి నుంచి తీవ్ర నడుము నొప్పితో బాధపడుతున్నాడు. నడవలేని పరిస్థితికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో జైనథ్ మండల కేంద్రానికి చెందిన మురళి ఈశ్వర్ తన వద్ద నడుము నొప్పికి నాటుమందు ఉందని చెప్పాడు. దీంతో నాందేడ్‌కు చెందిన పెయింటర్ జ్ఞానేశ్వర్ గురువారం మరో ఇద్దరితో కలిసి బైక్‌పై వచ్చి, మురళి ఈశ్వర్‌కు ఫోన్ చేశాడు.తాను అందుబాటులో లేనని, పక్క గ్రామమైన దీపాయిగూడకు చెందిన సునీల్ రెడ్డిని కలువాలని చెప్పి ఫోన్ నంబర్ ఇచ్చాడు. దీంతో వారు సునీల్ రెడ్డిని కలవగా, మందు కోసం రూ.12వేలు కావాలని అడగడంతో ఇచ్చేశారు. అయితే తనతో ఒకరే బైక్‌పై రావాలని చెప్పి జ్ఞానేశ్వర్‌తో వచ్చిన ఒక వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకొని మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్దకు తీసుకెళ్లాడు. అతడి వద్ద ఉన్న రూ.7వేల విలువ చేసే సెల్‌ఫోన్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయాడు. దీంతో బాధితులు మురళి ఈశ్వర్, సునీల్‌రెడ్డికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచాఫ్ రావడంతో చేసేదిలేక శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అయితే అసలు మహారాష్ట్రకు చెందిన ముగ్గురు జైనథ్‌కు చెందిన వ్యక్తులను ఎలా నమ్మారు? ఎందుకు రూ.12వేలు ఇచ్చారు? అసలు వీరి మధ్య ఇంకా ఏమైన ఉందా? అసలు ఏం జరిగింది అనేది ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతానికి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

సీఎస్‌ను కలిసిన ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్

బాసర(ముధోల్): తెలంగాణ రాష్ట్ర నూతన చీఫ్ సెక్రటరీ శాంతికుమారిని గురువారం బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ హైదరాబాద్‌లో కలిశారు. సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ బాసరను సందర్శిస్తానని, విద్యార్థుల వసతులు, సౌకర్యాల కల్పన, విద్యా ప్రమాణాలు, ఆర్జీయూకేటీలో జరుగుతున్న పలు కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై సీఎస్ వాకాబు చేశారు.


చీఫ్ సెక్రటరీకి మొక్క అందిస్తున్న వైస్ చాన్స్‌లర్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని బడక మెహళకు చెందిన రిటైర్డు ఉద్యోగి షబ్బీర్ అహ్మద్ ఖాన్ ఇల్లు షార్ట్ సర్క్యూట్ శుక్రవారం దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో మంటలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు సంఘటన స్థలానికి చేరుకుని విలువైన వస్తువులతో పాటు పలు కాగితాలు దగ్ధమైనట్లుగా తెలిపాడు. ప్రభుత్వం అదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్

లక్ష్మణచాంద: మండలంలోని లక్ష్మణచాంద, పార్పెల్లి గ్రామాల్లో శుక్రవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించే క్రమంలో రోడ్డుపై వెళ్తున్న కేజీవీల్ ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్‌చేశారు. యజమానిపై కేసు నమోదు చేశారు. కేజీవీల్ ట్రాక్టర్ రోడ్డుపై ఎటువంటి తొడుగులు లేకుండా వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇలా ఎవరైనా చేస్తే చర్యలు తప్పవన్నారు.


పోలీసులు పట్టుకున్న కేజీవీల్ ట్రాక్టర్